నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 31 ఆగస్టు 2024 | NIZAMABAD



# ఎన్నాళ్లీ ఎదురు చూపులు!?

## ‘రుణమాఫీ’ ప్రక్రియ అస్తవ్యస్తం

- రైతువేదికల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- మాఫీపై అధికారుల నుంచి స్పష్టత కరువు
- అయోమయంలో అన్నదాతలు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన రుణమాఫీ ప్రక్రియ గందరగోళంగా మారింది. మొదటి, రెండు, మూడు విడుతల్లోనూ ఉమ్మడి జిల్లాలోని కొందరు రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై వారు బ్యాంకులు, రైతువేదికల వద్ద ఉన్న అధికారులను సంప్రదించగా.. వారి నుంచి సమాధానం కరువైంది. కొందరు అధికారులు త్వరలో వస్తదని, మరికొందరు ఏదో పొరపాటు జరిగి ఉండొచ్చని చెప్పడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. రుణమాఫీపై ఇంతవరకూ స్పష్టత రాకపోవడంతో ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తంచేస్తున్నారు.



### పొరపాటు జరిగి ఉండొచ్చని చెబుతున్నరు..

నాకు ఎకరం 6 గుంటల భూమి ఉండగా.. 2018లో రూ. 69 వేలు క్రాప్‌లోన్ తీసుకున్నా. ప్రతి ఏడాది రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నా కానీ నాకురుణమాఫీ కాలేదు. మూడో విడుతలో కూడా నా పేరులేదు. అధికారులనడిగితే ఏదో పొరపాటు జరిగి ఉండొచ్చని చెబుతున్నారు.

**- అక్కమ్మ సాయిబోయి, రైతు, కల్లూర్, పొతంగల్ మండలం**



### మూడు జాబితాల్లోనూ నా పేరు లేదు

గతేడాది జూన్‌లో ఎత్తొండ బ్యాంకులో లక్షా ఐదు వేల రూపాయల రుణం తీసుకున్నా. ప్రభుత్వం మూడు విడుతల్లో ఇచ్చిన లిస్టుల్లో మాత్రం నా పేరు లేదు. అధికారులకు అడిగితే వస్తది.. వస్తది అని చెబుతున్నారు. నెల రోజుల నుంచి మాఫీ కోసం ఎదురుచూస్తున్నా. మాఫీ ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు.

**- చిక్లే రాజేశ్వర్, రైతు, టాక్లీ, ఉమ్మడి కోటగిరి మండలం**



### లిస్టులో ఇప్పటిదాక నాపేరు రాలే..

నాకు నాలుగున్నర ఎకరాల పొలం ఉండగా.. నేను బ్యాంకులో రెండు లక్షల పైన అప్పు తీసుకున్నా. కానీ రుణ మాఫీ లిస్టులో ఇప్పటివరకు నా పేరు రాలేదు. అసలు ఎం జరుగుతుందో ఏమో అర్థం అయితలేదు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం మాకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలి.

**- ముత్తయ్య, రైతు, దొంచంద, ఏర్గట్ల మండలం**



### బ్యాంకులో అడిగితే సమాధానం లేదు

కోటగిరి, ఆగస్టు 19 : ఎత్తొండ గ్రామీణ బ్యాంకులో రూ. లక్షా ఐదువేల క్రాప్ లోన్ తీసుకున్నా. అన్ని పత్రాల్లో పేర్లు సరిగ్గా ఉన్నా నాకు రుణ మాఫీ కాలేదు. వ్యవసాయాధికారికి, బ్యాంకులో అడిగితే ఎలాంటి సమాధానమూ లేదు. గతంలో రూ.95 వేలు కేసీఆర్ సర్కారు మాఫీ చేసింది.

**- దివిటే బల్వంత్‌రావు, రైతు, టాక్లి**

# నాడి పట్టే వారేరి?

**బాన్సువాడ దవాఖానలో వైద్యుల కొరత**

- నిత్యం వెయ్యి మందికి పైగా రోగుల తాకిడి
- డాక్టర్లు లేక అందని వైద్య సేవలు
- 45 మందికి గాను ఉన్నది 17 మంది మాత్రమే
- వైద్యం అందక వెనుదిరుగుతున్న రోగులు
- నిజామాబాద్‌కు రిఫర్ చేస్తున్న డాక్టర్లు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏరియా దవాఖాన


**మెరుగైన వసతులు..** నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఎన్నో అవార్డులను, ఘనతలను సొంతం చేసుకున్న బాన్సువాడ దవాఖానలో పరిస్థితి ఇప్పుడు పూర్తిగా దిగజారింది. రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన ఎంసీహెచ్, మాతాశిశు సంరక్షణ కేంద్రాల్లో వైద్య సేవలు అందడమే గగనంగా మారింది. అనారోగ్యంతో వెళ్తే పట్టించుకునే వారే లేరు. ఏమైందని నాడి పట్టి చూసే వారే కరువయ్యారు. సకల వసతులు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా సరిపడా వైద్యులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. విషజ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో నాడిపట్టే వారు లేకుండా పోయారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే వారిని చూసే వారు సైతం లేక కామారెడ్డి, నిజామాబాద్‌కు రిఫర్ చేస్తున్నారు.

*-బాన్సువాడ, ఆగస్టు 30*

**తెలంగాణ** రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వ సహకారంతో బాన్సువాడ దవాఖాన దశాదిశ మారిపోయింది. వంద పడకల దవాఖానలో అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చింది. మాతాశిశు సంరక్షణ కేంద్రం నెలకొల్పి గర్భిణులు, బాలింతలు, శిశువులకు అత్యాధునిక వైద్య సేవలు తీసుకొచ్చారు. ఫలితంగా జాతీయ స్థాయిలో పేరొచ్చింది. వరుసగా కాయకల్పతో పాటు బ్రెస్ట్ ఫీడింగ్ వంటి అవార్డులు సైతం వరించాయి. మొన్నటిదాకా ఓ స్థాయిలో వెలుగొందిన దవాఖానల పరిస్థితి ఇప్పుడు దారుణంగా తయారైంది. 45 మంది వైద్యులకు గాను 17మందే ఉన్నారు. అందులోనూ కొందరు కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్నారు.

**ఎంసీహెచ్‌లో అంతంతే..**

ఎంసీహెచ్‌లో గైనకాలజిస్టు పోస్టులు మూడు ఉంటే, ఇద్దరే ఉన్నారు. ముగ్గురు మత్తు డాక్టర్లకు గాను ఒక్కరు మాత్రమే అది కూడా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. ముగ్గురు పిల్లల వైద్యులు ఉండాల్సి ఉండగా, ఒక్కరూ లేరు. మూడు జనరల్ మెడిసిన్ పోస్టులకు గాను ఉన్నది ఒక్కరే. అది కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలందిస్తున్నారు. మూడు జనరల్ సర్జన్ పోస్టులకు గాను ఒక్కరి(కాంట్రాక్ట్ విధానమే)తో నెట్టుకొస్తున్నారు. ఆర్థోపెడిక్ విభాగంలోనూ కాంట్రాక్ట్ విధానంలోనే సేవలందిస్తున్నారు. రేడియాలజిస్టు డిప్యూటేషన్‌పై వస్తున్నారు. కంటి వైద్య నిపుణుడి పోస్టు ఖాళీగా ఉంది. ఈఎన్‌టీ డాక్టర్ ఉన్నత చదువులకోసమని వెళ్లగా, ఇక్కడ సేవలందించే వారు లేరు. పాథలాజీ విభాగంలో ఉన్న రెండు పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. రెగ్యులర్ డెంటిస్టు లేకపోవడంతో కాంట్రాక్ట్ విధానంలో కానిచ్చేస్తున్నారు. సైకాలజీ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఫోరెన్సిక్ మెడిసిన్ అందించే వారూ కరువయ్యారు.



**ఎంసీహెచ్‌లో కీలక విభాగాల్లో ఖాళీల పరిస్థితి**

| పోస్టులు | పనిచేస్తున్న వైద్యులు |
|---|---|
| **గైనకాలజిస్టులు** | |
| 3 | 2 |
| **అనస్థీషియా** | |
| 3 | 1(కాంట్రాక్ట్) |
| **పీడియాట్రిక్** | |
| 3 | 0 |
| **జనరల్ మెడిసిన్** | |
| 3 | 1(కాంట్రాక్ట్) |
| **జనరల్ సర్జన్** | |
| 3 | 1(కాంట్రాక్ట్) |



మాతాశిశు దవాఖానలో రోగుల రద్దీ

### నిత్యం వెయ్యి మందికి పైగానే..

బాన్సువాడ ఏరియా దవాఖాన, మాతా శిశు సంరక్షణ కేంద్రానికి రోగుల తాకిడి విపరీతంగా ఉంటుంది. ఎల్లారెడ్డి, జుక్కల్, నారాయణఖేడ్, మెదక్ నియోజకవర్గాలతో పాటు పక్కనున్న మహారాష్ట్ర, కర్ణాటక నుంచి సైతం ఇక్కడకు వస్తుంటారు. జనరల్ విభాగంలోనే నిత్యం 600 వరకు, చిన్నపిల్లల విభాగంలో 250 వరకు ఓపీ నమోదవుతుంటుంది. మహిళలు, గర్భిణులు, ఇతరత్రా సమస్యలతో వచ్చే వారితో సహా వెయ్యి మంది వరకు నిత్యం వైద్య సేవల కోసం వస్తుంటారు. కానీ వైద్యులు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు, కుటుంబ సభ్యులు ఆగమవుతున్నారు.



### ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం..

దవాఖానలో వైద్యుల కొరత ఉన్నమాట వాస్తవమే. గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులు, ఇతర డాక్టర్లు అవసరం ఉంది. మొత్తం 45 మందికి గాను ప్రస్తుతం 17 మంది పని చేస్తున్నారు. అయినప్పటికీ రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఖాళీల భర్తీ కోసం కలెక్టర్‌కు విన్నవించాం. త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు.

**- విజయలక్ష్మి, దవాఖాన సూపరింటెండెంట్**

### పట్టించుకునేటోళ్లే లేరు..

మా వాళ్లకు పాణం మంచిగ లేకపోతే రాత్రి బాన్సువాడ సర్కారు దవాఖనకు తీసుకొచ్చిన. కడుపు నొప్పితో గిలగిల కొట్టుకుంటుంటే పట్టించుకునేటోళ్లే లేరు. పేరు రాసుకున్నరు తప్పితే రోగిని చూసేటోళ్లే లేరు. ఆడ పని చేసేటోళ్లని వోళ్లని అడిగినా పట్టించుకుంటలేరు. గిదేందని గట్టిగా అడిగితే డాక్టర్లు లేరని చెప్పిండ్రు. మస్తు తిప్పలైంది. అరె పాణం మంచిగ లేదని అస్తే డాక్టర్లు లేరని చెప్పుడేంది.

**- చరణ్, జేకే తండా, బాన్సువాడ**





### మాతాశిశు సంరక్షణ కేంద్రంలోనూ ఖాళీలే..

మాతాశిశు సంరక్షణ కేంద్రంలోనూ వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు గైనకాలజిస్టులకు గాను ఇద్దరు ఉన్నారు. ఇద్దరు పిల్లల డాక్టర్లు ఉండాల్సి ఉండగా, ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. ఇద్దరు మత్తు వైద్యులు, సివిల్ సర్జన్, జనరల్ సర్జన్ అందుబాటులో లేకపోవడంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు.

జీజీహెచ్‌లో శుక్రవారం ఓపీ వద్ద బారులు తీరిన రోగులు



# కిక్కిరిసిన జీజీహెచ్

- రాష్ట్రంలోనే అత్యధికంగా రోగుల తాకిడి
- మొన్న స్టేట్‌లో ఫస్ట్.. నిన్న సెకండ్ ప్లేస్
- విష జ్వరాల తీవ్రతను కళ్లకు కడుతున్న వైనం

ఖలీల్‌వాడి, ఆగస్టు 30: నగరంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన (జీజీహెచ్) రోగులతో కిటకిటలాడుతున్నది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడ ఓపీ నమోదవుతున్నది. బుధ, గురువారాల్లో 2600లకు పైగా ఓపీ నమోదుతో జీజీహెచ్ రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచింది. తాజాగా శుక్రవారం 2700 ఓపీతో రెండో స్థానాన్ని ఆక్రమించింది. ప్రభుత్వ దవాఖానకు కొనసాగుతున్న రోగల తాకిడి జిల్లాలో విష జ్వరాల తీవ్రత ఏ స్థాయిలో ఉందో కళ్లకు కడుతున్నది.

**సీజనల్ వ్యాధుల పంజా**

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వైరల్ ఫీవర్, చికున్ గున్యా, డెంగ్యూ వంటివి వ్యాపిస్తుండడంతో ఏ ఇంట చూసినా జ్వరంతో బాధ పడుతున్న వారే కనిపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలోనే అత్యధిక ఓపీ నమోదు చేస్తూ నిజామాబాద్ జీజీహెచ్ రికార్డులకెక్కింది. బుధవారం రోజున 2,680, గురువారం నాడు 2,600 ఓపీ నమోదుతో రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచింది. శుక్రవారం వరంగల్ ఫస్ట్ ప్లేస్‌లో నిలువగా, 2,700 ఓపీతో మన జీజీహెచ్ రెండో స్థానంలో నిలిచిందని సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ తెలిపారు. రోగుల తాకిడి తీవ్రంగా ఉన్నప్పటికీ వైద్య సేవల్లో ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని ఆమె చెప్పారు.

**ప్రైవేట్‌లోనూ అంతే..**

మరోవైపు, విషజ్వరాలతో బాధ పడుతున్న వారితో ప్రైవేట్ దవాఖానలూ సందడిగా మారాయి. మోస్తరు నుంచి సూపర్ స్పెషాలిటీ దవాఖానల వరకు అన్నింట్లోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇదే అదనుగా కొందరు నిర్వాహకులు రోగులను దోచుకుంటున్నారు. డెంగ్యూ పేరి చెప్పి, ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయంటూ డబ్బులు దండుకుంటున్నారు.

### అందరికీ వైద్యం అందిస్తున్నాం..



జీజీహెచ్‌కు రోగుల తాకిడి బాగా పెరిగింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఓపీ నమోదైంది. శుక్రవారం కూడా 2700 మందికి ఓపీ సేవలు అందించాం. ఎంత మంది వచ్చినా నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నాం.

**- ప్రతిమరాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్**

### అమ్దాపూర్‌లో ఒకరికి డెంగ్యూ

శక్కర్‌నగర్, ఆగస్టు 30: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతికి డెంగ్యూ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. వారం రోజులుగా జ్వరం రావడంతో సదరు యువతిని ఆమె కుటుంబీకులు బోధన్‌లోని జిల్లా ప్రభు త్వ దవాఖానకు తీసుకెళ్లి రక్తపరీక్షలు చేయించారు. సదరు యువతికి డెంగ్యూ సోకినట్లు రక్తపరీక్షలో నిర్ధారణ అయినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఆమెకు వైద్య చికిత్స అందించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు సూచించారు. పలుచోట్ల డెంగ్యూ సోకుతుండడం తో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అమ్దాపూర్ గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు.

# సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

**బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి**

నవీపేట, ఆగస్టు 30: ఎస్సారెస్పీలో తగినంత నీటి లభ్యత లేకపోవడంతో అలీసాగర్ నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కోస్లీ గోదావరి నది మొదటి పంప్ హౌస్ వద్ద కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి అలీసాగర్ నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..నీటిని పొదుపుగా వాడుకుంటే రెండో పంట కూడా పండించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం అలీసాగర్ కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేశారు.

**అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తాం**

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రుణమాఫీ అంశాన్ని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. రుణమాఫీ కోసం రూ. 18 వేల కోట్లు విడుదల చేయగా.. రైతుల ఖాతాల్లో రూ. 11 వేల కోట్లు జమ అయినట్లు తెలిపారు. మిగతా రూ. 7వేల కోట్లు ఆయా బ్యాంకుల్లో జమచేసి ఉన్నాయన్నారు.



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి అలీసాగర్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

# ప్రజలను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు

**మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆగ్రహం**

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 30: మున్సిపల్ అధికారులు క్రమశిక్షణతో ఉండాలని, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్‌తోపాటు వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గణపతి విగ్రహాల తయారీదారులు..ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు.పర్మిషన్ల కోసం మున్సిపల్ అధికారులు డబ్బులు అడుగుతున్నారని, తాము రూ.నాలుగు వేలు చెల్లించినా, రూ.30 వేలు కట్టాలంటూ నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ఎమ్మెల్యే.. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలను కమిషనర్ రాజును అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# కాంగ్రెస్ కనుసన్నల్లో పోలీసు వ్యవస్థ

- నాయకులకు గులాంగిరీ చేయడం సిగ్గుచేటు
- పోలీసు అధికారులపై అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆగ్రహం

వినాయక్‌నగర్, ఆగస్టు 30: అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పోలీసు వ్యవస్థ నడుస్తున్నదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మండిపడ్డారు. రాజకీయాలకు సంబంధం లేకుండా స్వయం ప్రతిపత్తితో ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీసు వ్యవస్థ ..అధికార పార్టీ నేతలకు గులాంగిరీ చేయడం సిగ్గుచేటన్న ఎమ్మెల్యే.. అలాంటి అధికారులు ఖాకీ చొక్కా తీసి ఖద్దరు చొక్కా వేసుకోవాలని హితవు పలికారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీ ఉత్తర్వులు నిలిపివేయడంపై ఆయన ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీ ఉత్తర్వులు ఇచ్చి మళ్లీ ఆపడం వెనుక ఉన్న మతలబు ఏమిటో సీపీ, ఐజీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొందరు సీఐలపై ఎన్నో అభియోగాలు వస్తున్నాయని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నిజామాబాద్ నగరంలో పోలీస్ అధికారిగా పని చేయాలంటే ముందు కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇక్కడకు రావాలా ఏమిటి? అని ప్రశ్నించారు. సామాన్యులకు న్యాయం చేసే అంశాలపై దృష్టి పెట్టకుండా రాజకీయ నాయకులకు గులాంగిరీ చేస్తానంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.

# నత్తనడకన ‘లెండి’ పనులు

**ప్రాజెక్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు**

మద్నూర్, ఆగస్టు 30: మహారాష్ట్రలోని ముఖేడ్ వద్ద 35 ఏండ్ల క్రితం ప్రారంభించిన లెండి ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రం నుంచి ప్రత్యేక బస్సులో నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులతో కలిసి ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. అక్కడ కొనసాగుతున్న పనులను పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం.. మహారాష్ట్ర ప్రభుత్వంతో లెండి ప్రాజెక్టు నిర్మాణంపై చర్చలు జరుపుతున్నదని తెలిపారు. ప్రాజెక్టును పూర్తిచేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పూర్తయితే జుక్కల్ నియోజకవర్గ పరిధిలో 22 వేల ఎకరాల వరకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే తెలిపారు.



ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు